క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహ స్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భజనలు, రాత్రి పల్లకిసేవ గావించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

పిడూరురోడ్డు మార్గంలో..


పూజలందుకుంటున్న సాయినాథుడు

మనుబోలు : మండల కేంద్రంలోని పిడూరు రోడ్డు మార్గంలో ఉన్న సాయిబాబా మందిరం లో గురువారం విశేష పూజలు జరిగాయి. అర్చ కుడు శ్రీనివాసులు సాయినాథునికి అభిషే కాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుని దర్శిం చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్ర సాద వితరణ జరిగింది. ఏలూరు భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహ రించారు.

ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ సభ్యుడి రాజీనామా



సుజీవన్

పొదలకూరు : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఓ రాజ కీయ పార్టీకి కొమ్ముకాస్తు న్నందున ఆ సంఘ కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు నాగసూరి సుజీవన్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డిని తీసుకొచ్చి ఆర్యవైశ్య సం ఘ బాధ్యులకు సన్మానం చేయించినట్లు తెలి పారు. సంఘ కార్యకలాపాలకు రాజకీయ నాయకులను ఆహ్వానించడాన్ని ఖండిస్తున్నట్లు తెలియజేశారు. తమ కుటుంబం మంత్రి కాకాణి అభిమానులమన్నారు. సంఘ బాధ్యుల్లో చాలా వరకు టీడీపీకి కొమ్ముకాస్తు న్నందున తన పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): గాంధీగిరిజన కాలనీ సమీపం లోని పెన్నా అండర్ బ్రిడ్జి వద్ద గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను సం తపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8,930 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో అనధికార మద్యం విక్రయాలు, పంపిణీ, నగదు అక్రమ రవాణా, పంపిణీ తదితరాలను కట్టడి చేసేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహి స్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఈ తరహా కార్యక్రమాలతో పాటు చట్టవ్యతిరేక కార్య క్రమాలను గుర్తిస్తే డయల్ 112, 94407 00097 నంబర్లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బైక్‌ల దహనం



నెల్లూరు(క్రైమ్): మైపాడుగేటు సమీపంలోని దర్గా సమీపంలో రహదారిపై పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు గుర్తుతెలియని దుండ గులు బుధవారం అర్ధరాత్రి నిప్పు అంటిం చారు. మంటలను గమనించిన స్థానికులు నిద్ర నుంచి లేచి ఆర్పివేశారు. ఈ ఘటనలో నాలుగు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. ఈ మేరకు స్థానికులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

విద్యుత్ కష్టాలకు చెక్

- రూ.85 లక్షలతో ప్రమాదకర తీగల మార్పు
- దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం


విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి(ఫైల్)

పొదలకూరు : సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయి. వ్యవసాయ యోగ్యమైన విద్యుత్ సమస్యలతో పాటు, గ్రామం, పట్టణంలో నెలకొన్న సమస్యలను సైతం అధికారుల ద్వారా పరిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా పొదలకూరు, మరుపూరు, పులికల్లు తదితర గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ సమస్యలు ఉం డేవి. వాటిని విద్యుత్ అధికారులు పరిష్కరించారు. ఇళ్లపై తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తదితర సమస్యలు శాశ్వత పరిష్కారానికి నోచుకోవడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్షలు వెచ్చించి విద్యుత్ తీగల మార్పు

పట్టణంలో చాలా ఏళ్లుగా 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లపై వెళ్తున్న కారణంగా ఏడాదికొకరు ప్రాణాలు కోల్పోయేవారు. దీనిపై టైలర్స్‌కాలనీ, అగచాట్ల పురం, శింగయ్యచేను, శ్రీహరికాలనీ వాసులు గతంలో అనేక సార్లు నాయకులకు విజ్ఞప్తి చేసే వారు. అయితే ఏ నాయకుడు ముందుకొచ్చి వారి సమస్యకు పరిష్కారం చూపలేదు. ప్రభుత్వం చేప ట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి దృష్టికి విద్యుత్ సమస్యలు తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించి లైన్ల మార్పు కోసం అంచనాలు తయారు చేయించి రూ.85 లక్షలు వెచ్చించి ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను శర వేగంగా మార్పించారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఊపిరిపీల్చుకుని హాయిగా జీవిస్తున్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చాలాకాలంగా కొత్తగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫా ర్మర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రతి ప్రాం తంలో కొత్తగా విద్యుత్ స్తంభాలు అవసరమని స్థాని కులు విజ్ఞప్తి చేశారు. దీంతో విద్యుత్ అధికారుల ద్వారా ఇప్పటి వరకు మండలంలో 700 స్తంభాలను నిర్మించి కొత్తగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయించి పంచాయతీ ద్వారా లైట్లు కూడా వెలిగించారు. మండ లంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన గ్రామాల్లో మరో 175 విద్యుత్ స్తంభాలను నిర్మిం చారు. కొత్తగా ఏర్పడిన వీధులు, కాలనీలకు కూడా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఒక్క పట్ట ణంలోనే లో–ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఇటీవల 10 ట్రాన్స్‌ఫార్మర్లను బిగించారు. ఫలితంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు.


కొత్తగా ఏర్పడిన వీధుల్లో నిర్మించిన విద్యుత్ స్తంభాలు


పట్టణంలో కొత్తగా మార్చిన 11 కేవీ విద్యుత్ తీగలు

గతంలో ఎన్నడూ లేని విధంగా



గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ సమస్యలు పరిష్కారం అయ్యాయి. పట్టణం లోని పద్మావతినగర్‌లో మంత్రి కాకాణి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన సందర్భంగా విద్యుత్ స్తంభాల నిర్మాణాన్ని ప్రస్తావించాం . వెంటనే స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేయించారు.

– జి.జయరామిరెడ్డి, స్థానికుడు, పొదలకూరు

భరోసా ఇచ్చారు



ఇళ్లపై విద్యుత్ తీగలు ఉన్నందున ప్రమాదపు టంచున జీవించేవాళ్లం. మంత్రి పర్యటన వల్ల మా బతుకులకు భరోసా కలిగింది. రూ.లక్షలు వెచ్చించి వెం టనే పనులు చేపట్టి ఇళ్లపై ఉన్న 11 కేవీ తీగ లను మార్పించడం వల్ల భయాన్ని వీడి బతు కుతున్నాం.

– షేక్ సైదమ్మ, డాన్‌బోస్కోస్కూల్ వీధి, పొదలకూరు

యుద్ధప్రాతిపదికన పనులు

విద్యుత్ సమస్యలు గుర్తించి యుద్ధప్రాతి పదికన పనులు పూర్తి చేశాం. ప్రమాదకర విద్యుత్ తీగలను మార్చే పనులను విజయవంతంగా పూర్తి చేశాం. పట్టణం, గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను బిగించి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తు న్నాం.

– శ్రీకాంత్, విద్యుత్ ఏఈ, పొదలకూరు

ప్రగతి పథంలో పడుగుపాడు సొసైటీ

కోవూరు : పడుగుపాడు సహకార సొసైటీ ప్రగతి పథంలో పయనిస్తోందని ఆ సొసైటీ చైర్మన్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శాం తినగర్‌లో ఉన్న సహకార సొసైటీ కార్యాలయం లో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సొసైటీలో 16,760 సభ్యులు ఉన్నారన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 718 మంది రైతులకు రూ.22 కోట్ల మేర రుణాలు అందించినట్లు చెప్పారు. 460 మం ది రైతులకు రూ.15 కోట్ల రుణాలు ఇచ్చా మన్నారు. ప్రస్తుతం తమ బ్యాంక్‌లో లాకర్ సదు పాయం కూడా ఏర్పాటు చేసిన ఉందని, ఖాతాదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలో ఇనమడుగు గ్రామం లోని సొసైటీ స్థలంలో పెట్రోల్ బంక్ ప్రతిపాద నలు కూడా సిద్ధం చేశామని, త్వరలో ఈ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు ఎ.ప్రసాద్, జి.జ నార్దన్, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడిపర్తిలో మంత్రి ఎన్నికల ప్రచారం నేడు

వెంకటాచలం: మండలంలోని పూడిపర్తి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్య క్షుడు మందల వెంకటశేషయ్య గురువారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు పూడిపర్తిలో, ఆరు గంటలకు ఎగువమిట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుం దన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్


శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

కోవూరు : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలకు గైర్హా జరైతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. మండలం లోని గంగపట్నంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో కోవూరు నియోజకవర్గ పరిధిలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఇస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న పోలింగ్ జరుగనున్న దృ ష్ట్యా ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధి కారులకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాలో రెండు విడతల్లో సుమారు 16 వేల మంది సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికా రుల సమక్షంలో పూర్తి చేసినట్లు చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలని, ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేం దుకు సంసిద్ధం కావాలని సూచించారు. ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన పోలింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నియో జకవర్గ రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్, ఈఆర్వో విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

46 పందుల అపహరణ

మనుబోలు : మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 46 పందులు అపహరణకు గురైనట్లు బాధితులు గురువారం తెలిపారు. దీంతో తమకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు పెంపకం దారులు వాపోయారు. మనుబోలుకు చెందిన మధుసూదన్ పందులు పెంచుతూ జీవనం సాగి స్తున్నాడు. రెండు రోజుల క్రితం ఊరు బయట పందులు తిరుగుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తీసుకెళ్తుండగా స్థానికంగా చూసి నవారు చెప్పారని, న్యాయం చేయాలని కోరారు.

పోషకాహార ప్యాకెట్ల అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్న వాడ పీహెచ్‌సీలో 20 మంది టీబీ బాధితులకు పోషకాహార ప్యాకెట్లను గురువారం అంద జేశారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలి మాట్లాడారు. టీబీ బాధితులు సకాలంలో మందులు వాడి కోర్సు పూర్తి చేయడం ద్వారా వ్యాధిని సంపూర్ణంగా నయం చేయవచ్చని సూచించారు. చికిత్స సమయంలో ప్రతినెల ప్రభుత్వం తరపున రూ.500 అందిస్తార న్నారు. టీబీకి సంబంధించిన అన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్ కుమార్, సూపర్‌వైజర్లు సురేష్‌కుమార్, నరసింహులు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు

నెల్లూరు సిటీ: నగరంలోని మూడోమైలులో ఉన్న విఘ్నేశ్వరనగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన మహిళ దారుణ హత్య కేసులోని నిం దితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కిసాన్‌నగర్‌కు చెందిన మస్తాన మ్మ(46)ను నెల్లూరు చంటి గొంతుకోసి హత్య చేసి ఆమె కుమార్తె సునీతతో కలిసి అక్కడి నుం చి పరారైన విషయం తెలిసిందే. వారిని గురు వారం వేకువన పోలీసులు అదుపులోకి తీసు కున్నట్లు సమాచారం. కాగా మస్తానమ్మ హత్య సమయంలో మూడో వ్యక్తి కూడా ఘటనా స్థలం లో ఉన్నట్లు తెలిసింది. సదరు వ్యక్తి ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నారని సమాచారం. సదరు వ్యక్తి హత్యకు సహకరించారా..లేదా.. అనేది పోలీ సుల విచారణలో తేలాల్సి ఉంది.

ప్రశాంత ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నియోజకవర్గంలో 324 పోలింగ్ కేంద్రాలు
- కోవూరు రిటర్నింగ్ అధికారి, జేసీ సేతు మాధవన్



కోవూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కోవూరు నియోజకవర్గం లో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధి కారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. కోవూరు ఆర్వో కార్యాలయంలో ఆయన గురు వారం విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట ల్లో.. నియోజకవర్గ పరిధిలోని కోవూరు, బుచ్చిరెడ్డి పాళెం, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవ లూరు మండలాల్లో అడ్మినిస్ట్రేషన్ రిటర్నింగ్ అధికా రులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాం. నియో జకవర్గంలో 2,61,125 మంది ఓటర్లు ఉన్నారు. ఇం దులో పురుషులు 1,26,270, స్త్రీలు 1,34,835, ఇత రులు 20 ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో 324 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల కోడ్ అమలు కాకముందే ప్రతి మండలంలో ఈవీఎం, వీవీ ప్యాడ్ వినియోగం, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవ గాహన చేపట్టాం. నియోజకవర్గంలో 324 పోలింగ్ కేంద్రాల పరిధిలో 92 మంది సెక్టోరల్ అధికారు లను నియమించాం. వీరికి రెండు సార్లు శిక్షణ కూడా ఇచ్చాం. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, కుర్చీలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వృ ద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు ఏఆర్వోలకు ఆదేశాలు ఇచ్చాం.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

రాజకీయ పార్టీలు ప్రచారం, ఎన్నికల సభలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలి. దీని కోసం సువిధ యాప్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిటర్నింగ్ అధికారి ద్వారా వెంటనే ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ, పోలీస్, పంచా యతీరాజ్, అగ్నిమాపకం, ఆర్టీఓ ఫోన్లకు సమా చారం వెళ్తుంది. వారు పరిశీలించిన అనంతరం 48 గంటల్లో అనుమతి జారీ చేస్తాం. అనుమతి పొం దిన రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ నిబంధ లకు మేరకు ప్రచారం నిర్వహించాలి. వాహన ర్యాలీలు, జెండాలు అనుమతికి మించి ఉంటే అభ్య ర్థి ఖర్చు ఖాతాలో చూపిస్తాం.

పోలింగ్ శాతం పెంపునకు కృషి

కోవూరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో మానిటరింగ్ వ్యవస్థ చేపట్టాం. 2019 ఎన్నికల్లో 74 శాతం పోలింగ్ నమోదైంది. దీనిని అధిగమించేం దుకు కృషి చేస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లు, వృద్ధులు, దివ్యాంగులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తూ పోలింగ్ కేంద్రాల వద్ద వారికి కల్పించే సౌకర్యాలు గురించి వివరిస్తున్నాం. అనుమతులకు మించి రాజకీయ పార్టీల ర్యాలీలు, ప్రదర్శన తది తర అంశాలపై సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే స్పందిస్తాం.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న యువత

కోవూరు : రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని పడుగుపాడు సహకార పరపతి సం ఘం చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న సొసైటీ ప్రాంగ ణంలో రెడ్‌క్రాస్ సహకారంతో మెగా రక్తదాన శిబి రాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతిఒ క్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చని తెలి పారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు గునుపాటి ప్రసా ద్‌రెడ్డి మాట్లాడుతూ పడుగుపాడు సొసైటీ ఆధ్వ ర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీ యమన్నారు. దాదాపు 60 యూనిట్ల రక్తదానం చేశారు. కార్యక్రమంలో మోటివేటర్ భాస్కర్ సొసైటీ ఉద్యోగులు, రైతులు ఉన్నారు.

ఎగసిన అభిమానం



ముత్తుకూరు : ఎన్నికల ప్రచారంలో భాగంగా గురు వారం రాత్రి వల్లూరు పంచాయతీలో పర్యటించిన రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎనలేని అభిమానం కురిపించారు. బండ్ల పాళెంలో అడుగుపెట్టిన కాకాణిని సర్పంచ్ పెంచల ప్రతాప్ వర్గీయులు గజమాలతో స్వాగతం పలి కారు. పూలవర్షం కురిపించారు. పెద్ద సంఖ్యలో అభిమానులు కేరింతలు కొట్టారు. సర్వేపల్లి నుంచి మూడోసారి కాకాణిని గెలిపించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఇదేంటి వేమన్నా..


ఇటీవల ప్రజాగళం కార్యక్రమంలో మల్లికార్జున


తాజాగా వేమిరెడ్డి దంపతుల సమక్షంలో టీడీపీ కండువా కప్పుకుంటున్న మల్లికార్జున

- సొంత పార్టీ వారికే కండువాలు కప్పుతున్న వైనం

కోవూరు: కోవూరు టీడీపీలో చేరికలంటూ వారు చేస్తున్న విన్యాసాలు రోజురోజుకు దిగజారిపోతు న్నాయి. సొంత పార్టీ నేతలకే కండువాలు వేసి చేరి కలు అని ప్రకటించుకోవడంతో ఇదేంటి వేమన్నా.. అంటూ ఆయన అభిమానులు నవ్విపోతున్నారు. కొడవలూరు మండలం కొత్తవంగల్లుకు చెందిన మద్దెల మల్లికార్జున తొలి నుంచి టీడీపీ కార్యకర్త. అదే గ్రామ పంచాయతీ నాలుగో వార్డు మెంబర్ కూడా. కొంత కాలం క్రితం పోలంరెడ్డి శ్రీనివా సులురెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. మరి కొం తకాలానికి ఆయన తనయుడు దినేష్‌రెడ్డి సమక్షం లో మరోసారి టీడీపీలో చేరినట్లు కండువాలు కప్పుకున్నారు. తాజాగా వేమిరెడ్డి దంపతుల సమ క్షంలో టీడీపీ కండువా కప్పుకున్నాడు. ఈ చర్యతో తెలుగు తమ్ముళ్లే అవాక్కవుతున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల ఆర్థికాభివృద్ధి


కొడవలూరు: ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు


పొదలకూరు : అభివృద్ధిపై కరపత్రాన్ని అందజేస్తున్న పూజిత

- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయి రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం మండ లంలోని నార్తురాజుపాళెం నిమ్మతోట ప్రాంతం లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరికం అంతరిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందినట్లేన న్నారు. ఆ దిశగానే సీఎం వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి పేదరికం లేని రాష్ట్రం కోసం కృషి చేస్తు న్నారని వివరించారు. మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎం పీపీ జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఎన్.మాణిక్యరావు, పి.మధుసూదన్‌రెడ్డి, కృష్ణా రెడ్డి, పి.మధు, జి.జనార్దన్‌రెడ్డి, కె.మోహన్‌రావు, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కు మార్‌రెడ్డి ఓటర్లను కోరారు. నగర పంచాయతీ పరి ధిలోని పదో వార్డులో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్ మల్లారెడ్డితో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతిఇంటికి వెళ్లి వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎం పీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుం దన్నారు. 18వ వార్డులో కౌన్సిలర్ మోర్ల జయంతి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 14వ వార్డులో కౌన్సిలర్ ప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యం లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

నాలుగో రోజు

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పట్టణంలో నాలుగో రోజు గురువారం ఎన్ని కల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నే శ్వరపురం, నర్సారెడ్డికాలనీ, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఓటర్లను పూజిత కలిసి ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. వైఎ స్సార్‌సీపీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెం ట జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ జి.లక్ష్మీక ల్యాణి, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు అంజాద్, భాస్కర్, హరి, మూర్తిరెడ్డి, నాయకుల జి.వేణుగోపాల్‌రెడ్డి, మూలి సతీష్‌కుమా ర్‌రెడ్డి, ఎం.రవికుమార్, భారతమ్మ, డి.విజయభాస్క ర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల పనిదినాలు పెంచండి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరిం చాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్‌ను విద్యుత్ భవన్‌లోని ఆయన చాంబ ర్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్య దర్శి హజరత్‌వలీ మాట్లాడుతూ మీటర్ రీడింగ్ తీసే పనిదినాలను ఏడు రోజులకు తగ్గించడంతో మీటర్ రీడర్ల వేతనం తగ్గిపోతుండడంతో పాటు వారు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యను ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ విజయా నంద్ దృష్టికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బాలకాశి తీసుకెళ్లగా మీటర్ రీడింగ్ తీసే పనిది నాలను తొమ్మిది రోజులకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా ఏప్రిల్ నుంచి పని దినాలను పెంచడంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా జీతాలు సకాలంలో ఇవ్వని కాం ట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. అనంతరం సీనియర్ అకౌం ట్స్ ఆఫీసర్ మురళికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఈను కలిసిన వారిలో యూనియన్ నాయ కులు ఫిరోజ్‌ఖాన్, నరసింహ, విజయ్, సాయి ఉన్నారు.